కథానిక

# పెళ్ళింపాటలో దగా

"సులోచన"

సోమసుందరయ్యగారు ఆ గ్రామంలో అందరి కంటె సంపన్న గృహస్థు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. దానితోపాటు ఆయన గారికి సంతానం కూడా మహాఘనంగా ఉండటంచాత ఒకవిధంగా అదృష్టవంతుడని వూళ్ళో చిన్నా పెద్దా అనుకుంటూ ఉండే వాళ్ళు. ముగ్గురు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు. ఇంకా యిద్దరు కొడుకులు ఒక కుమార్తె వారి వారి కర్మల ఫలితంగా ఒక ఈడువాళ్ళు కాక మునుపే చనిపోయారు. ఆయనగారికి పశు సంపద, వస్తుసంపద, తరుగు లేకుండా ఉంది. మర్యాదకోసం అర్రులు చాచే గౌరవనీయుల్లో సోమసుందరయ్యగారు ఒకరని చెప్పక తప్పదు.

సోమసుందరయ్యగారి జ్యేష్ఠపుత్రుడు సోమనాథం పెళ్ళీడుకు వచ్చాడు. ఇంటర్ సీనియర్ పరీక్షలు వ్రాశాడు. సోమనాథం తల్లికీ, సోమసుందరయ్యగారికీ రెండు సంవత్సరాలుగా కొడుక్కి పెళ్ళి చేయాలని తీవ్రమైన పట్టుదల ఉన్నప్పటికీ తగిన సంబంధం రాని కారణం చాత ఆ పట్టుదల నెరవేరలేదు. ఈ సంవత్సరమైనా గట్టిగా వివాహమహోత్సవం జరిపించగాలని వాళ్ళు నిర్ణయించుకోవటంలో సంబంధాలు మరీచురుగ్గా వెతకటం ఆరంభించారు. కొన్ని దగ్గరకు వొచ్చిన సంబంధాలేవీ సోమసుందరయ్యగారికి నచ్చలేదు

వెంకటయ్య పంతులు ఒక సంబంధం తీసుకొ వచ్చాడు. పిల్ల అందంలో నైతే నేమి, చదువులో నైతే నేమి, గుణాల్లో నైతే నేమి వంక పెట్ట వీలు లేనిది కాని యివన్నీ సోమసుందరయ్యగారి దృష్టిలోనూ, ఆయన సతీమణి గారి దృష్టిలోనూ అతిసామాన్య విషయాలు. అసలు ముఖ్యమైంది పిల్ల తరుపువాళ్లు కట్నం ఎక్కువ యిచ్చుకోలేరు. ఆ లోపం ప్రస్ఫుటమైంది. కనుక సోమసుందరయ్యగారు కొడుకును కనుక్కోకుండా ఆ సంబంధం పనికిరాదని కొట్టివేశాడు. సోమనాథం ఎంత ఉదాత్త భావాలు కలవ్యక్తి అయినా కుటుంబ, ఆచారం, మొదలైన విషయాల్లో తండ్రి సలహా ప్రకారం నడుచుకోవాల్సిందే. ఎదురు చెప్పడానికి లేదు

ఇంకో సంబంధం వాళ్ళు తగినంత కట్నం యిస్తారు కాని పిల్ల యేమాత్రం కుర్రవాడి కంటె అందమైంది కాదు. నిజానికి సోమసుందరయ్యగారికి ఈ లోపం సంబంధాన్ని వొదులుకోవాల్సినంత అగత్యంగా అగపడలేదు కాని వాళ్ళ వంశంలో గౌరవం తక్కువగా ఉందిట. పెళ్ళికూతురు అక్క విధవరాలై కులం కాని వాణ్ణి లేవతీసుకొని వెళ్లి పెళ్లిచేసుకుందిట. పెళ్లికూతురు మేనత్తకూడా ఆ రకానికే చెందిందట. అందువల్ల సోమసుందరయ్యగారికి ఆ సంబంధం సుతరామూ నచ్చలేదు.

ఇంకా యింకో సంబంధమూ, మరో సంబంధమూ, ఇలాగే కట్నంలోపం వల్లనో వంశప్రతిష్ఠలోపం వల్లనో సోమసుందరయ్యగారికి నచ్చలేదు. ముఖ్యంగా ఆయనగారు చూసేది అధికకట్నం. కనీసం పెట్టుపోతలు ఎట్లా ఉన్నా అందరకీ కనపడేదీ, లగ్నం దగ్గర బ్రాహ్మడిచేత చెప్పించేదీ—అయిదు ఎకరాల పొలమూ, లేకుంటే రొక్కం పాతికవేల రూపాయలూ—ఇంతకట్నం కొడుక్కి రావాలని సోమసుందరయ్యగారి యత్నం. ఆయన గారి అభిప్రాయం యేమిటంటే; ఈ రోజుల్లో చదువు సంధ్యలు లేకపోయినా నాలుగెకరాల గడ్డ ఉంటే ఎట్లా లేదన్నా ఎకరం పొలం కట్నం యిస్తున్నారు అటువంటిది తన కొడుకు బి. ఏ. చదువబోతున్నవాడూ, [illegible] భాగం పంచుకున్నా ముప్పై ఎకరాల గడ్డకు అధిపతి కాగలవాడూ—ఇంక ఇంతే కట్నంగాక యేం వస్తుంది? ఈ అభిప్రాయమే

ఆయనగారిలో ఆశను రేకెత్తిస్తూ పనిచేయసాగింది.

వేసంగి సెలవలిచ్చి దాదాపు నెల కావొస్తున్నది. మంచిలగ్నాల కాలంకూడా మించిపోవొస్తూంది. సోమసుందరయ్యగారు ఈ సంవత్సరానికి కొడుకు వివాహం వాయిదా పడేట్టు వుందని కలవరపడసాగారు. అట్టి స్థితిలో గ్రామకరణంద్వారా ఒక పెద్దసంబంధం వొచ్చింది. పెళ్ళికూతురు తండ్రి గొప్ప ధనవంతుడు. రెండు మిల్లులకు యజమాని. బస్సు రూట్ ఉన్నది. కారుల కంపెనీలో పది అణాల వాటాఉంది. ఒక సినిమాహాలు ఆయన ఆధ్వర్యాన నడుస్తోంది. ఇంత హోదాగల వ్యక్తి, ఇంత పేరుగల గౌరవనీయుడైన వ్యక్తి, తన కొడుక్కి కూతుర్నిస్తానని గ్రామకరణం గారిద్వారా కబురుపంపటంవల్ల వాస్తవంగా సోమసుందరయ్యగారు విపరీతమైన సంతసానికీ, గర్వానికీ గురయ్యారని ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. ఈ సంబంధాన్ని ఎట్లాగైనా తన కొడుక్కి చేయాలని సోమసుందరయ్యగారు భార్యతో సహా నిశ్చయించారు. కరణంతో కూడా అదే చెప్పి, వివాహం కుదిర్చేట్టు చూడమని చెప్పారు.

పెళ్ళికూతురు తండ్రి శివరామారావుగారు, పెళ్ళికొడుకును చూసేందుకు గ్రామకరణం వెంట సోమసుందరయ్యగారింటికి వొచ్చారు.

సోమసుందరయ్యగారు మర్యాదలు చక్కగా జరిపారు. శివరామారావుగారు పెళ్ళికుమారుణ్ణి చూసి పలుకరించి ఏం చదువుతున్నావు, ఏం చదువబోతావు—ఇత్యాది ప్రశ్నలు వేసి సక్రమమైన జవాబులు రాబట్టుకొని సంతసించారు. ఆవీఈవీ మాట్లాడుకొని శుభలగ్నం నిర్ణయించారు. కాని యింతకీ శివరామారావుగారు ఎంతకట్నం యిస్తారో, ఇవ్వదలచారో సెలవియ్యలేదు. ఆ ముక్క సోమసుందరయ్యగారు అడక్కపోవటం మనకు మహాశ్చర్యం వేస్తుంది. అక్కడికీ ఆయనగారు కరణాన్ని అడిగారు.

"కట్నం కానుకల సంగతేమిటి?" అన్నారు సోమసుందరయ్యగారు కరణంతో.

"ఓస్! ఆ సంగతి మనం ప్రత్యేకంగా ఆయనగారిని అడగాలటయ్యా. ఆయనగారి హోదా స్థితిగతులూ తెలుసుగా. మనమేమీ నోరుతెరచి అడగక్కర్లేదు" అన్నాడు కరణం. సోమసుందరయ్యగారు "మంచిది" అనుకున్నారు.

కాని శివరామారావుగారు తను వరకట్నం ఎంత యిచ్చేదీ బయటపెట్టకుండా లగ్నం పెట్టించిన తరువాత సోమసుందరయ్యగారిని "అమ్మాయికి మీరు ఏం పెట్టదలుచుకున్నారు" అన్నారు. సోమసుందరయ్యగారికిది విపరీతంగా కనబడింది. ఇంతలో భార్య చాటుకు పిలిచి "ఏమిటండీ? తాను ఏం కట్నం యిచ్చేది చెప్పకుండా మనం ఎంత పెట్టేది చెప్పమంటాడు. భలే మనిషే" అంది.

"ఊరుకో. నీకు తెలీసులే, వందెకరాల నిక్షేపంలాంటి మాగాణి ఉంది. పైన వ్యాపారాలమూలంగా వచ్చే ఆదాయానికి అంతు ఉండదు. పిల్లలైనా ఎంతోమంది లేరుగా. ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. ఏ సినిమాహాలు కంట్రాక్టో మనవాడికిస్తే అదే మనం కోరిన కట్నానికి రెండు రెట్లవుతుంది" అన్నారు భార్యతో సోమసుందరయ్యగారు. శివరామారావుగారి సమక్షంలోకి వచ్చి—

"మేం పెట్టుపోతల్లో లోపం రానీయంలెండి. యాభై కాసుల బంగారం. అయిదువందల రూపాయల పట్టుచీర. ఇక మిగిలినవి కూడా ఆ స్థాయిలోనే పెట్టుతాం లెండి" సోమసుందరయ్యగారు విన్నవించటంతోటే శివరామారావుగారు ఒక్కదరహాసం ప్రకటించి లేచారు.

పెళ్ళి మహావైభవంగా జరిగింది. వచ్చిన పెళ్ళివారికి శివరామారావుగారు గొప్పగా ఆతిథ్యమిచ్చారు. కాని పెళ్ళికి వచ్చినవారిలో కలవరం బయలుదేరింది. పెళ్ళికి బ్రాహ్మడిచేత సెంటు పొలం కూడా చదివించలేదు, శివరామారావుగారు. "ఇదేమిటి సెంటు పొలం కట్నం లేకుండా సోమసుందరయ్యగారు కొడుక్కి పెళ్ళిచేశారు. మంచి కట్నం కోసమే కాదూ యిన్ని సంబంధాల్ని కాదని, యిన్ని రోజులు వివాహం ఆపింది" అని కొందరు, "ఆఁ! శివరామారావుగారు యే కొంచెం

యిచ్చినా, యే కార్ల కంపెనీలో భాగం పెట్టినా కట్నంకన్న ఎక్కువగా ఉంటుంది" అని మరికొందరు సర్ది చెప్పచూశారు. ఆడ వాళ్ళ విడ్డూరానికి అంతు లేదు.

ఏమైతేనేం పెళ్ళి మహావైభవంగా జరిగిపోయింది. శివరామారావుగారు వివాహమైన రెండు నెలల అనంతరం అల్లుడుకి మోటారు సైకిలు, రేడియో, గడియారం యిత్యాదులు అందరికీ ఘనంగా కనబడే వస్తువులు యిచ్చారు. సోమసుందరయ్యగారు, ఆయనగారి భార్య తమ వియ్యంకుడు అల్లుడికి పెట్టడం దీనితో ఆరంభమైనట్టు సంతోషపడసాగారు.

* * *

సోమనాథం బి. ఏ. మొదటిభాగం చదువుతున్నాడు, భార్య కాపరానికొచ్చి. రెండు సంవత్సరాలైంది. సోమనాథం బి. ఏ. ప్యాసయ్యాడు. ఒక కొడుకుపుట్టాడు. కాని యింతవరకు శివరామారావుగారు కట్నంరూపంలో దమ్మిడీ యివ్వలేదు. అప్పుడుయిచ్చిన మోటారు సైకిల్, రేడియో, గడియారమే. సోమసుందరయ్యగారు యింకా ఆశపెట్టుకున్నారు. ఆయనగారు భార్యతో కోడలిదగ్గర యీ కట్నం విషయం మరిచిపోయికూడా అనవద్దని కట్టుదిట్టంచేశారు. సోమనాథం ఉద్యోగం లేక బి. ఏ. డిగ్రీ పుచ్చుకు కూర్చున్నాడు. సినిమా హాలు మేనేజరుగానో, లేక మిల్లు మేనేజరుగానో, లేక కార్లకంపెనీ ప్రొప్రైటరుగానో తనని చేయగూడదూ మామగారు– అని చాలా సార్లు అనుకున్నాడు సోమనాథం. ఆ మాట కొస్తే సోమసుందరయ్యగారుకూడా చాలా సార్లు యిలాగే భావించారు. కాని శివరామారావుగారు అదేమీ గమనించలేదు. సోమనాథం భార్య యీవిషయం తండ్రికి చెప్పలేదు. అసలు సోమనాథానికి ఈ విషయం మామతో చెప్పమని భార్యతో అనే తాహతులేదుగా.

శివరామారావుగారికి పక్షవాతం ప్రవేశించింది. ఇహ తను బ్రతికినా బ్రతికినట్టు లెక్కకాదని తన యిద్దరు కొడుకులకి వ్యాపారంఅంతా వప్పచెప్పాడు. అప్పుడైనా సోమనాథానికి ఉద్యోగం తన కంపెనీల్లో యిచ్చేందుకు అవకాశం శివరామారావుగారు కల్పించలేదు. సోమనాథం నోరుతెరచి అడగనూ లేదు.

ఇంకా సోమసుందరయ్యగారికి వియ్యంకుడు వరకట్నం క్రింద యేదో ఒక మొత్తం ఏదో ఒక రూపంగా తప్పకుండా యిస్తాడనే ఆశ యెందుకుందో ఎవరికీ అర్థంకాలేదు.

స్కెచ్

# సమ్మె కట్టిన గుమాస్తాలు

ద్రోణంరాజు కృష్ణమోహన్

లింగమూర్తి ఎంతో వినయంగా వంగి నమస్కరించాడు మేనేజరు ముందునిలబడి.

తలెత్తి చూసి మళ్ళీదించుకుని "కూర్చో వయ్యా! ఏం మళ్ళీ యేదైనా తగాదా లేవదీశావా?"—విసుగ్గా ప్రశ్నించాడు.

"తగాదా యేముంటండీ! ఇదివరకు మనవి చేసుకున్నదే! జీతాలు అందరికీ పదిహేనేసి రూపాయల చొప్పున ఎక్కువ చేస్తామని ఏడాది క్రిందటే మాటిచ్చారు కాని—"

"జీతాలు, జీతాలు! ఎప్పుడూ యిదేగొడవా మీకు! అసలే మా వ్యాపారం దివాలాగా వుంటే!"

"చిత్తం! ఈ మాట రెండేళ్లనుంచీ అంటున్నారు."

"అవునయ్యా! నిజమే! ఇందులో అబద్ధం యేముంది! నువ్వు చూడటంలేదూ! ప్రదర్శించేవన్నీ చెత్తచిత్రాలు. దమ్మిడీ కలెక్షన్ రావడం లేదు. పైగా యీ రిప్రజెంటేటివ్‌లు తెగ కాజేస్తున్నారు మధ్యలో"

"ఆ సంగతి ఎలా వున్నప్పటికీ మాకు అవసరం. తమ వ్యాపారానికి నష్టమేమీ రావటం లేదు. ఈమధ్య వచ్చిన రెండు తెలుగుచిత్రాలు తమరేగా రిలీజుచేసింది! నెలలతరబడి ఆడాయి, డబ్బు ఒకటికి పదిరెట్లు లాభం వచ్చింది. మాకు